సాక్షి ఒడిశా
మంగళవారం । 13 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,64,665లు,బంగారం 5 గ్రాములు 600 మిల్లీగ్రాములు, వెండి 17 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



చోరీ కేసులో నిందితుల అరెస్టు

ఒక చోరీ కేసుకు సంబంధించి జిల్లాలోని అంబొదల పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

- 8లో

స్వాతంత్య్ర స్ఫూర్తితో..!



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్థానిక లోక్ సేవా భవన్‌లో 'హర్ ఘర్ తిరంగ' ప్రచార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం ప్రారంభించారు.

- 8లో

న్యూస్‌రీల్

విద్యార్థినికి నగదు ప్రోత్సాహం



విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని గుసాని సమితి కోర్సండ గ్రామంలో రాజీవ్ మెమోరియల్ ఉన్నత విద్యాలయంలో చదువుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన తర్లాన తనూజకు పాతపట్నంకు చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పరశెల్లి రామరాజు నగదు ప్రోత్సాహం సోమవారం అందజేశారు. ఆమెతో పాటు 2024లో బాలల విజ్ఞాన ప్రదర్శనలో బహుమతి పొందిన రేణుశ్రీకు అభినందన పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ధర్మాన కామేశ్వరరావు, కోర్సండ ప్రధాన ఉపాధ్యాయుడు బల్ల రాజశేఖర్, గైడ్ టీచర్ మధుస్మిత తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 15న సుభద్ర యోజన మార్గదర్శకాలు

భువనేశ్వర్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సుభద్ర యోజన పథకం మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేయనుంది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రభాతి పరిడా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అమలు, కార్యాచరణ కోసం నిర్ధారిత మార్గదర్శకాలు జారీ అయ్యాక లబ్ధిదారుల అర్హతపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అధిక ఆదాయ వర్గానికి చెందిన మహిళలు ఈ పథకానికి అర్హులయ్యే అవకాశం లేదని ఆమె పేర్కొన్నారు. ఆదాయపు పన్ను చెల్లించే వారికి పథకం కింద ప్రయోజనం నిరాకరించే అవకాశం ఉందన్నారు. పథకం ప్రయోజనం పొందడానికి ఆధార్ కార్డ్ చాలా ముఖ్యమైన పత్రంగా పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలి బీజేపీ ప్రభుత్వం ప్రతిపాదించిన 2024 – 25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌లో సుభద్ర యోజన పథకానికి రూ.10,000 కోట్లు కేటాయించిన విషయం తెలిసిందే. అవసరమైతే ఆ మొత్తాన్ని పెంచవచ్చని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సెప్టెంబర్ 17న ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్రంలో సుభద్ర యోజనను ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఇప్పటికే ప్రకటించారు. ఈ పథకం కింద మహిళలకు ఒక్కొక్కరికీ రూ. 50,000 నగదు వోచర్ జారీ చేస్తారు. సుభద్ర యోజన ప్రారంభోత్సవానికి దాదాపు 5 లక్షల మంది మహిళలు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన బీజేపీ ప్రభుత్వ తొలి మంత్రి మండలి సమావేశం 100 రోజుల్లో ఈ పథకాన్ని అమలు చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. 2024 ఎన్నికల కోసం ఒడిశా బీజేపీ మేనిఫెస్టోలో ఇది కీలక వాగ్దానం.

తుపాకీతో భయపెట్టిన వ్యక్తి అరెస్టు



అరెస్టైన సరోజ్ మిశ్ర, సీజ్ చేసిన తుపాకీ, తూటాలు

జయపురం: ఒక వ్యక్తిని తుపాకీతో భయపెట్టిన కేసులో పట్టణ పోలీసులు స్థానిక ఇరిగేషన్ కాలనీకి చెందిన సరోజ్ మిశ్ర అనే వ్యక్తిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక మిల్లువీధికి చెందిన సూర్యనారాయణ అనే వ్యక్తి బైక్‌పై దైనిక బజారుకు వచ్చాడు. అతడు ఎంజీ రోడ్డులోని శివ మందిరం సమీపంలో బైక్ పార్క్ చేశాడు. ఆ సమయంలో ఇరిగేషన్ కాలనీకి చెందిన సరోజ్ మిశ్ర ఒక స్కూటీపై వస్తూ సూర్యనారాయణ బైక్‌ని ఢీకొనగా సైలెన్సర్ వంగింది. ఇరువురి మధ్య వాగ్వాదం పెరిగింది. తన బైక్‌ను రిపేర్ చేసి ఇవ్వాలని సూర్యనారాయణ డిమాండ్ చేశాడు. దీంతో సరోజ్ మిశ్ర తన వద్దనున్న తుపాకీ చూపించి భయపెట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అనంతరం సరోజ్ మిశ్రను ఆదివారం అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి రమణీ రంజన్ దొళాయి సోమవారం వెల్లడించారు. నిందితుని వద్ద నుంచి ఒక తుపాకీ, రెండు తూటాలు, ఒక స్కూటీ సీజ్ చేసినట్లు తెలిపారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి

భువనేశ్వర్: పూరీలో పిడుగుపాటుకు ఓ మహిళ మృతి చెందగా, మరో 7 మందికి గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కుంతి భోయ్ (45) అనే మహిళ పూరీ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచింది. మరో 7 మందిని చికిత్స కోసం ఆస్పత్రిలో చేర్చారు. వివరాల్లోకి వెళ్తే.. పూరీ చైతన భోయ్ సాహి ప్రాంతంలో సోమవారం ఉదయం సాగు పనుల్లో నిమగ్నమై ఉన్న ఎనిమిది మంది గ్రామస్తులపై పిడుగు పడింది. గ్రామస్తులు క్షతగాత్రులను పూరీ డీహెచ్‌హెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ కుంతి తుది శ్వాస విడిచింది.

చొరబాట్లుకు చోటివ్వం... అక్రమ వలసలు ఏరివేస్తాం



- రాష్ట్రంలోకి బంగ్లాదేశీయులు చొరబడే అవకాశం లేదు
- త్వరలో వలసదారుల గుర్తింపు ప్రక్రియ
- న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్

భువనేశ్వర్: అల్లకల్లోలంగా ఉన్న బంగ్లాదేశ్ నుంచి పలువురు బంగ్లాదేశీయులు తీరప్రాంతం గుండా రాష్ట్రంలోకి చొరబడే అవకాశం లేదని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ స్పష్టం చేశారు. సుదీర్ఘ 480 కిలోమీటర్ల తీరప్రాంతంలో చొరబాటుదారులను నివారించేందుకు నిఘాను పటిష్టపరిచామన్నారు. అలాగే రాష్ట్రంలో నివసిస్తున్న బంగ్లాదేశీ వలసదారుల ధ్రువీకరణను ముమ్మరం చేశారు. సరైన పత్రాలు లేకుండా వలస వచ్చినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. శరణార్థులుగా వచ్చిన వారిని పౌరసత్వ (సవరణ) చట్టం 2019 (సీఏఏ) కింద భారత పౌరసత్వం పొందే ప్రక్రియలో చేర్చవచ్చు. అయితే పశ్చిమ బెంగాల్‌లోని సరిహద్దు ప్రాంతాల గుండా చొరబడి నేరుగా పడవల్లో ఇక్కడికి చేరుకునే వారు కూడా ఉన్నారు. వీసా మరియు వర్క్ పర్మిట్ వంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా ఇక్కడ స్థిరపడిన, వివిధ ఆర్థిక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్న అక్రమ బంగ్లాదేశ్ వలసదారులను గుర్తించే ప్రక్రియ త్వరలో నిర్వహించబడుతుందన్నారు. క్షుణ్ణంగా ధ్రువీకరించిన తర్వాత, ఒడిశాలో అక్రమంగా నివసిస్తున్న ఎవరైనా వలసదారులను ఏరివేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న అశాంతి మధ్య తీరం వెంబడి పహారా ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి మెరైన్ ఠాణా పోలీసులు, కోస్ట్‌గార్డ్ వర్గాలను ఆదేశించిన తర్వాత, సముద్ర మార్గం గుండా బంగ్లా దేశీయులు తీరప్రాంతంలోకి ప్రవేశించేందుకు ఎటువంటి అవకాశం లేదని మంత్రి తెలిపారు.

అవాంఛనీయ ఘటనలు

చొరబాటుదారుల భయంతో రాష్ట్రం సరిహద్దు జిల్లాల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. భద్రక్ జిల్లాలోని బాసుదేవ్‌పూర్‌లో స్థానికులు ఆటో రిక్షాలో ప్రయాణిస్తున్న 6 మంది అనుమానిత బంగ్లాదేశ్ జాతీయులను అడ్డగించి పోలీసులకు అప్పగించారు. జిల్లాలోని నాయికానిడిహి పోలీసు ఠాణా పరిధిలోని నొలొబంకి ఛక్ వద్ద మరో యువకుడిని స్థానికులు అదుపులోకి తీసుకున్నారు. అయితే మహ్మద్ నిజారత్, మహ్మద్ అబ్దుల్లా, మహ్మద్ హైమ్, మహ్మద్ అలీ, మహ్మద్ సలీం, మహ్మద్ ఆలం అనే 6 మంది బీహార్ నుంచి భిక్షాటన చేసేందుకు వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. కటిహార్ జిల్లాలోని అజంగఢ్ పోలీస్ ఠాణా పరిధిలోని అజంపూర్ గ్రామానికి చెందిన ఈ బృందం 5 రోజుల క్రితం రైలులో భద్రక్‌కు వచ్చి ఆ ప్రాంతంలో భిక్షాటన చేస్తోంది. అనుమానితులు అందించిన సమాచారాన్ని ధ్రువీకరించడానికి బాసుదేవ్‌పూర్ ఠాణా పోలీసులు అజంగఢ్‌లోని వారి సహచరులను సంప్రదించారు.

మూడంచెల భద్రత



బంగ్లాదేశీయుల చొరబాటు నివారణ చర్యల్లో భాగంగా తీరప్రాంతం వెంబడి మూడంచెల భద్రతతో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ఇండియన్ నేవీ, కోస్ట్ గార్డ్, ఒడిశా మెరైన్ పోలీసులు ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. మొదటి 5 నాటికల్ మైళ్లలో ఒడిశా మెరైన్ పోలీసులు కాపలాగా ఉండగా, 5 నాటికల్ మైళ్ల మధ్య జలాలు మరియు తీరానికి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేశ సముద్ర సరిహద్దులో కోస్ట్ గార్డ్ సిబ్బంది నిఘా కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. భారత నావికాదళం కూడా అంతర్జాతీయ జలాల్లో పర్యవేక్షిస్తూ, గస్తీ నిర్వహిస్తోందని ఓ పోలీసు అధికారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హెచ్చరిక తర్వాత ఇటీవల పరిణామాల నేపథ్యంలో రాష్ట్ర తీరప్రాంత సరిహద్దుల్లో నిఘాను నిర్వహించడానికి పహారాను ముమ్మరం చేసినట్లు ఒడిశా పోలీసులు తెలిపారు.

3,740 మంది చొరబాటుదారులు

గతేడాది శాసన సభలో సమర్పించిన సమాచారం ప్రకారం 11 జిల్లాల్లో 1,57,432 మంది బంగ్లాదేశ్ సెటిలర్లు, 7 జిల్లాల్లో 3,740 మంది చొరబాటుదారులు ఉన్నారు. అక్రమ వలసదారుల్లో కేంద్రాపడాలో 1,649, జగత్‌సింగ్‌పూర్‌లో 1,112, మల్కన్‌గిరిలో 655, భద్రక్‌లో 199, నవరంగ్‌పూర్‌లో 106, ఖుర్దా (భువనేశ్వర్)లో 17 మంది మాత్రమే ఉన్నారు. అలాగే శరణార్థుల్లో అత్యధికంగా మల్కన్‌గిరి జిల్లాలో 1,04,233 మంది, నవరంగపూర్‌లో 46,848 మంది, ఖుర్దాలో 4,653 మంది, కేంద్రాపడాలో 441 మంది, జాజ్‌పూర్‌లో 379 మంది, రాయగడలో 304 మంది, భద్రక్‌లో 200 మంది, కొరాపుట్‌లో 194 మంది, కలహండిలో 90 మంది, బాలాసోర్‌లో 75 మంది, అంగుల్‌లో 15 మంది స్థిరపడినట్లు తెలుస్తోంది.

రాష్ట్రంలో అంధుల వర్సిటీ యోచన

- త్వరలో ముఖ్యమంత్రికి ప్రతిపాదన

భువనేశ్వర్:

రాష్ట్రంలో అంధుల కోసం ప్రత్యేక విశ్వ విద్యాలయం ఏర్పాటు కానుంది. రాష్ట్ర ప్రభుత్వం యోచన ప్రకారం ఏర్పాటైతే దేశంలో మొదటి అంధుల విశ్వ విద్యాలయంగా నిలుస్తుంది. అంధులకు విద్య, సాంకేతిక కోర్సుల్లో ఉన్నత స్థాయి బోధన, శిక్షణ కల్పించడం ఈ సంస్థ లక్ష్యంగా పేర్కొన్నారు. దేశంలో 50 లక్షల మందికి పైగా అంధులు ఉన్నారు. వారిలో 5 లక్షల 21 వేల మంది పైబడి రాష్ట్రంలో ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. వీరిలో సుమారు రెండు 2 లక్షల మంది యువకులు అంధులుగా ఉన్నారు. అందువల్ల అంధుల విద్య మరియు శిక్షణ అవసరాలను తీర్చడానికి సమగ్రమైన, ప్రత్యేకమైన విశ్వ విద్యాలయం అవసరమని సామాజిక భద్రత, దివ్యాంగుల సాధికారత (ఎస్ఎస్ఈపీడీ) విభాగం డిప్యూటీ సెక్రటరీ సన్యసాయి బెహరా తెలిపారు.

భీమ భొయి పేరు

ప్రతిపాదిత విశ్వ విద్యాలయానికి అంధ కవి, 19వ శతాబ్ధపు సంఘ సంస్కర్త భీమ భొయ్ పేరు పెట్టనున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ఇప్పటికే భీమ భొయి అంధ, బధిర పాఠశాల విజయవంతంగా పని చేస్తోంది. భీమ భొయి అంధుల విశ్వ విద్యాలయంలో టెక్నికల్ స్కూల్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కూడా ఉంటాయన్నారు. అంధులకు ప్రసిద్ధి చెందిన జపాన్‌లోని సుకుబా విశ్వ విద్యాలయం ప్రతినిధుల బృందం ఇటీవల ఈ విషయంలో ఎస్ఎస్ఈపీడీ అధికారులతో సమావేశం అయింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనను త్వరలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝికి పంపుతామని ఈ సమావేశం అనంతరం విభాగం కార్యదర్శి సన్యసాయి బెహరా తెలిపారు. ఈ ప్రణాళికలో యూనివర్సిటీ క్యాంపస్‌లో అధునాతన డిజిటల్ ల్యాబ్‌తో నివాస సౌకర్యాలు ఉంటాయన్నారు. ఎస్ఎస్ఈపీడీ ప్రముఖ కార్యదర్శి బిష్ణుపద సెఠి మాట్లాడుతూ భారతదేశం, విదేశాల నుంచి 9 వ తరగతి నుంచి విద్యార్థులకు విద్యను అందించడానికి ప్రభుత్వం క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందని తెలిపారు. దీనిలో విధాన పరిశోధనతో పాటు ఆక్యుపంక్చర్, ఫిజియోథెరపీ వంటి వత్తిపరమైన కోర్సులను అందించనున్నట్లు పేర్కొన్నారు.

ధరలు పెరిగాయి.. దయ చూపండి

- మంత్రికి మధ్యాహ్న భోజన నిర్వాహకుల విజ్ఞప్తి

జయపురం:

ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యవసర సరుకుల ధరలు అమాంతం పెరిగాయని, అందువలన మధ్యాహ్న భోజనానికి విద్యార్థులపై పెట్టే ఖర్చును పెంచాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులైన స్వయం సహాయక సంఘాల మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం జయపురం వచ్చేసిన రాష్ట్ర గణ విద్య, ఆదివాసీ హరిజన సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండును కలిసి వినతిపత్రం అందజేశారు. 2015–16 విద్యా సంవత్సరంలో ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి ఒక్కొక్కరికీ రూ.4.21లు ఖర్చు చేస్తుండేవారు. అయితే ఇన్నేళ్లలో కేవలం రూ.1.70లు మాత్రమే పెంచారని తెలిపారు. అలాగే ఉన్నత ప్రైమరీ పాఠశాలల విద్యార్థులకు 2015–16 విద్యా సంవత్సరంలో మధ్యాహ్న భోజనానికి ఒక్కొక్కరికీ రూ.6.29లు ఇచ్చేవారని, అయితే ఇప్పటివరకు కేవలం రూ.2.53 మాత్రమే పెంచారని వెల్లడించారు. కానీ ప్రస్తుతం కూరగాయలు, పప్పులు, బియ్యం ధరలు పెరిగాయని, అందువలన ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమకూర్చడం సాధ్యమవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త ప్రభుత్వమైనా మధ్యాహ్న భోజన నిర్వహణలో తమ సమస్యలు గుర్తించి ధరలను పెంచాలని విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి స్పందించి కొద్ది రోజుల్లోనే మధ్యాహ్న భోజన ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకుంటామని, అలాగే హాస్టల్స్ విద్యార్థులకు కోసం కొత్త పథకాలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందించినవారిలో స్వయం సహాయక గ్రూపు అసోసియేషన్ ప్రతినిధులు సురభీ పాణి, సుక్షమ సుక్ల, కె.భవానీ రెడ్డి, దీప ఆచారి, సావిత్రి బెహర తదితరులు ఉన్నారు.



మంత్రి నిత్యానందకు సమస్యలు వివరిస్తున్న ఎస్‌హెచ్‌జీ మహిళలు

వన్యప్రాణుల సంరక్షణపై చిత్రలేఖనం పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో అటవీ శాఖ రేంజర్ పాణిగ్రాహి తదితరులు

రాయగడ: జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఉన్నటువంటి సరస్వతీ శిశు విద్యా మందిరంలో వన్యప్రాణుల సంరక్షణపై చిత్రలేఖనం పోటీలు సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టికిరి అటవీ శాఖ రేంజర్ అనిల్ కుమార్ పాణిగ్రహి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లోపంతో అడవులు అంతరించిపోతున్నాయని, దీంతో ఎన్నో వన్యప్రాణులు కనుమరుగవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా కొందరు తమ వేటతో వన్యప్రాణులను బలి తీసుకుంటున్నారని పేర్కొన్నారు. అందరూ చైతన్యవంతులైతే వన్యప్రాణులను కాపాడుకోగలమని దీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్‌లో జరగనున్న వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాలను పురస్కరించుకొని పోటీలు నిర్వహించినట్లు విద్యా సంస్థ తెలియజేసింది. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల వేడుకల్లో బహుమతులు అందజేయనున్నారు.



వన్యప్రాణులపై బొమ్మ గీస్తున్న విద్యార్థి

రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి



కొరాపుట్: లారీ కింద దంపతుల మృతదేహాలు



కొరాపుట్: స్థానికులను సముదాయిస్తున్న పోలీసులు



జయపురం: చికిత్స పొందుతున్న శివరాం మఝి

కొరాపుట్: రోడ్డు ప్రమాదంలో దంపతులు మృత్యువాతపడిన దుర్ఘటన నబరంగ్‌పూర్ జిల్లా రాయిఘర్ సమితి కుందయి పోలీస్‌స్టేషన్ పరిధి రమనాగుడ వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శ్రావణ మాసం ఆఖరి సోమవారం కావడంతో రాయిఘర్ సమితిలోని బెంగాలీ శరణార్థి గ్రామం పోర్చిపరా నుంచి అజిత్ మజుందర్(34), దీపికా మజుందార్ (30) దంపతులు భోల్‌భం యాత్రకి బయల్దేరారు. సమీప ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం సియావా నది నుంచి పవిత్ర జలాలను తీసుకొని కావిళ్లతో రాయిఘర్ సమీపంలోని హతబరండి గ్రామానికి చేరుకున్నారు. అక్కడ శివలింగానికి తీసుకొచ్చిన పవిత్ర నీటితో అభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం బైక్ మీద తమ ఆరేళ్ల కుమారుడితో కలసి తిరుగు ప్రయాణమయ్యారు. అయితే కొద్దిదూరం వెళ్లాక నీలగిరి కలప లోడుతో ఛత్తీస్‌ఘఢ్ వైపు వెళ్తున్న లారీ వారిని ఢీకొంది. దీంతో దంపతులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. బాలుడు మాత్రం త్రుటిలో తప్పించుకున్నాడు. ఇది చూసిన స్థానికులు బాలుడిని సురక్షితంగా లారీ కింద నుంచి బయటకు తీశారు. వెంటనే గ్రామస్తులు అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. దీంతో రాయ్‌పూర్‌కి వెళ్లే రహదారిపై భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కుందయి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులను శాంతింపజేశారు. మృతదేహాలను హతబరండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ప్రాణాలతో బయటపడిన బాలుడికి అదే ఆస్పత్రిలో చికిత్స చేస్తున్నారు.

సేవకుడికి తీవ్రగాయాలు

జయపురం: గుప్తేశ్వర్ పుణ్యక్షేత్రంలో మహాశివుడిని దర్శించుకునే భోల్‌భం భక్తులకు సేవలు చేసేందుకు వెళ్లిన ఒక వ్యక్తిని బొలేరో ఢీకొనడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. నవరంగపూర్ జిల్లా సిందిగుడ గ్రామం నుంచి 60 మందికిపైగా భక్తులు జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి గుప్తేశ్వర్‌లో శివుడిని దర్శించుకునేందుకు వెళ్లారు. అక్కడ వారి మంచి చెడ్డలు చూసేందుకు సిందిగుడ నుంచి కొంతమంది సహాయకులు వారితో గుప్తేశ్వర్ వచ్చారు. మార్గంలో డొకిరీ ఘాట్ వద్ద భోల్‌భం భక్తులకు సేవలు చేస్తున్న సమయంలో గుప్తేశ్వర్ నుంచి వస్తున్న ఒక బొలేరో వాహనం భక్తులకు సేవలు అందించేందుకు వచ్చిన శివరాం మఝిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో శివరాం రోడ్డుపై ఎగిరిపడ్డాడు. అతడి కాలు, తల, చెవికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే అతడిని రామగిరి హాస్పిటల్‌లో చేర్చారు. అక్కడ ప్రథమ చికిత్స అందజేసినా చెవి నుంచి రక్తం ఎక్కువగా రావడం వలన బొయిపరిగుడ కమ్యూనిటీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.


కొనసాగుతున్న సోదాలు



సోదాల్లో బయటపడిన సొత్తు



విలాసవంతమైన బెంజ్ కారు



విలువైన రోలెక్స్ చేతి గడియారం

భువనేశ్వర్: ఆర్అండ్‌బీ మాజీ చీఫ్ ఇంజినీర్ తారా ప్రసాద్ మిశ్రా అక్రమాస్తులపై సోదాలు కొనసాగుతున్నాయి. సోదాల్లో 12 మంది డీఎస్పీలు, 12 మంది ఇన్‌స్పెక్టర్లు, 16 మంది ఏఎస్ఐలు మరియు ఇతర సహాయక సిబ్బందితో కూడిన ప్రత్యేక విజిలెన్స్ బృందాలు పాల్గొన్నాయి. స్థానిక ప్రత్యేక విజిలెన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి జారీ చేసిన సెర్చ్ వారెంట్లతో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన సోదాల్లో భువనేశ్వర్‌లో 10 ఫ్లాట్లు, 7 ఇళ్ల స్థలాలు, రూ.2.70 కోట్ల డిపాజిట్లు, ఒకటిన్నర కిలోల బంగారం, రూ.6 లక్షల నగదు, బెంజ్ కారు, రూ.13 లక్షల విలువైన రోలెక్స్ రిస్ట్ వాచ్ మొదలైనవి గుర్తించారు. ఒక అధికారి వద్ద ఇంత పెద్ద మొత్తంలో సొత్తు లభ్యమవ్వడం సంచలనమైంది.

స్వాతంత్య్ర వేడుకలకు ఆహ్వానం



సుకాంతి జెనా

భువనేశ్వర్: ఈ ఏడాది జాతీయ స్థాయి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు అతిథిగా హాజరు కావాలని పూరీ చంద్రపూర్ బరత్‌జంగ్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త సుకాంతి జెనాకు ఢిల్లీ నుంచి ఆహ్వానం అందింది. జాతీయ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథి హాజరై ఢిల్లీలోని ఇతర అతిథుల మధ్య కూర్చుని కవాతును వీక్షిస్తారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యాలయం నుంచి ఆమెకు ఆహ్వాన పత్రం వచ్చింది. మంగళవారం తన కుమార్తెతో కలిసి రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో న్యూఢిల్లీకి బయల్దేరనున్నారు.

క్లుప్తంగా

ఢిల్లీ పర్యటనకు సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి న్యూఢిల్లీ పర్యటనకు సోమవారం బయల్దేరారు. దేశ రాజధానిలో మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమానికి ఆయన హాజరుకానున్నారు. ఒడిశాలో జాతీయ రహదారుల నిర్మాణంపై నేషనల్ హైవే అథారిటీస్ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)తో ముఖ్యమంత్రి చర్చిస్తారు. దేశ రాజధానిలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి అనేక మంది కేంద్ర మంత్రులతో సమావేశమై ఒడిశాకు సంబంధించిన అనేక అంశాలపై చర్చలు జరపనున్నారు. మరి కొందరు బీజేపీ కేంద్ర నేతలను కూడా కలవనున్నారు.

భూ వివాదంలో కుటుంబ సభ్యులపై వ్యక్తి దాడి


గాయపడిన కాంతమ్మ

రాయగడ: భూ వివాదానికి సంబంధించి తమ సొంత పెద్దమ్మ, వదినపై ఒక వ్యక్తి దాడి చేసిన ఘటన జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి ఖొరాజొడ గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ఈ దాడిలో కాంతమ్మ బాగ్ (67), తులసీ బాగ్ (37)లు తీవ్రగాయాలకు గురయ్యారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఖొరాజొడి గ్రామంలో నివసిస్తున్న దుర్గేశ్ బాగ్ అనే వ్యక్తికి, తమ పెద్దమ్మ కుటుంబ సభ్యులకు మధ్య కొన్నేళ్లుగా భూ వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దుర్గేశ్ ఆదివారం పెద్దమ్మతో గొడవపడ్డాడు. ఇరువర్గాల మధ్య గొడవ పెరగడంతో కోపోద్రేక్తుడైన దుర్గేశ్ ఒక కర్రతో పెద్దమ్మ తలపై కొట్టాడు. అడ్డుపడిన వదిన తులసిపై కూడా దాడి చేయడంతో వారిరువురు గాయాలు పాలయ్యారు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, దుర్గేశ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే తనపైనే తన పెద్దమ్మ, వదినలు దాడి చేయడంతో పాటు తన మెడలోని బంగారు గొలుసును తెంచారని దుర్గేశ్ చెబుతున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు


అరెస్టైన కేబుల్ వైర్ల దొంగలను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి జిల్లాలోని అంబొదల పోలీసులు ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 8 బండెల్స్ ఎలక్ట్రిక్ కేబుల్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిలో బంధాగుడ గ్రామానికి చెందిన సుభాష్ నుండ్రుక, అసురుపడ గ్రామానికి చెందిన వేణుధర్ సగడియా, గోపబంధు హియాల్, జాలు ఎయాల్, మున్నా జకసికలు ఉన్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల మేరకు.. ఔరంగాబాద్ జిల్లాకు చెందిన గుప్తాసింగ్ అనే వ్యక్తి లారీలో రాజస్తాన్ నుంచి లంజిఘడ్ జిల్లాలోని వేదాంత కంపెనీకి సంబంధించిన ఎలక్ట్రికల్ కేబుల్ వైర్లను లారీలో జూలై 31వ తేదీన తీసుకొచ్చాడు. ఈ సమయంలో ఉదయం 7 గంటల ప్రాంతంలో అసురుపడ గ్రామం వద్ద 5 బైకులపై వచ్చిన గుర్తు తెలియని దుండగులు లారీకి అడ్డంగా నిలబడి ఆపారు. అనంతరం అద్దాలను పగులగొట్టి డ్రైవర్ గుప్తా సింగ్‌ను బెదిరించి లారీలోని కేబుల్ వైర్ల బండెల్స్‌ను తీసుకెళ్లిపోయారు. ఈ మేరకు అంబొదల పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు, కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో రాష్ట్ర విద్యాసంస్థలు

భువనేశ్వర్: కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) సోమవారం వివిధ కేటగిరీల్లో ప్రతిష్టాత్మక ర్యాంకింగ్స్ జాబితాను విడుదల చేసింది. ఇంజినీరింగ్‌లో భారతదేశ ర్యాంకింగ్‌ల ప్రకారం టాప్ 20 జాబితాలో రాష్ట్రం నుంచి చోటు చేసుకున్న ఏకైక సంస్థ ఎన్ఐటీ రౌర్కెలా కావడం విశేషం. ఎన్ఐటీ రౌర్కెలా 63.38 పాయింట్ల స్కోర్‌తో 19వ స్థానాన్ని ఆక్రమించింది. శిక్షా ఓ అనుసంధాన్ (ఎస్ఓఏ) 60.97 స్కోర్‌తో 26వ స్థానంలో నిలిచింది. ఇండియా ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ ర్యాంకింగ్స్‌లో ఎన్ఐటీ రౌర్కెలా టాప్ 10లో ఉంది. ఈ వర్గంలో 64.88 స్కోర్‌తో 9వ స్థానం చేజిక్కించుకుంది. సమగ్ర భారతదేశ ర్యాంకింగ్స్, ఇండియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ అనే రెండు విభాగాల్లో ఎస్ఓఏ రాష్ట్రంలో అగ్రగామి సంస్థగా నిలిచింది.

సమగ్ర భారతదేశ ర్యాంకింగ్స్‌లో 60.73 పాయింట్ల స్కోర్‌తో 24వ స్థానంలో నిలిచింది. 59.94 పాయింట్ల స్కోర్‌తో కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ (కిట్) 28వ స్థానం సొంతం చేసుకుంది. ఇండియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో ఎస్ఓఏ 62.61 పాయింట్ల స్కోర్‌తో 14వ స్థానంతో టాప్ 15లో చోటు చేసుకుంది. కిట్ 62.53 స్కోర్‌తో 15వ స్థానంలో ఉంది. రాష్ట్ర ప్రభుత్వ విశ్వ విద్యాలయాల వర్గంలో ఉత్కళ విశ్వ విద్యాలయం 50.27 స్కోర్‌తో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌తో 41వ స్థానంలో ఉంది.

స్వాతంత్య్ర స్ఫూర్తితో..!

- 'హర్‌ఘర్ తిరంగ' ప్రచారంలో సీఎం మోహన్‌చరణ్ మాఝి

భువనేశ్వర్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్థానిక లోక్‌సేవా భవన్‌లో 'హర్ ఘర్ తిరంగ' ప్రచార కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సోమవారం ప్రారంభించారు. 78వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ప్రతి భారతీయుడు తమ ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని రగిలించేలా ప్రోత్సహించడం ఈ ప్రచారం లక్ష్యం. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి 'హర్ ఘర్ తిరంగా' ప్రచార బోర్డుపై 'జై హింద్' నినాదాన్ని రాశారు. మన జాతీయ జెండా మన గౌరవానికి ప్రతీకగా పేర్కొన్నారు. జాతీయ పతాకం ప్రాముఖ్యత గురించి ప్రతీ పౌరుడికి అవగాహన కల్పించడమే ఈ ప్రచారం లక్ష్యమని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రచారంలో పాల్గొని తమ ఇళ్ల ప్రాంగణంలో జాతీయ పతాకం ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, మత్స్య, పశు వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారంలో పాల్గొనే విధానం

1. www.harghartiranga. com వెబ్‌సైట్‌కి వెళ్లి, అప్‌లోడ్ సెల్ఫీపై క్లిక్ చేయాలి. ఆపై 'క్లిక్ టు పార్టిసిపేట్' లేదా తదుపరి ఎంపికను ఎంచుకోండి.
2. మీ పేరు, ఫోన్ నంబర్, రాష్ట్రం, దేశాన్ని నమోదు చేయండి.
3. 'నేను త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తానని, మన స్వాతంత్య్ర సమరయోధులు, ధీరుల స్ఫూర్తిని గౌరవిస్తాను మరియు భారతదేశ అభివృద్ధి మరియు పురోగతికి నేను అంకితం అవుతానని ప్రమాణం చేస్తున్నాను' అనే ప్రతిజ్ఞపై క్లిక్ చేసి త్రివర్ణ పతాకంతో మీ సెల్ఫీలను అప్‌లోడ్ చేయండి.
4. సైట్‌లో చిత్రాన్ని ఉపయోగించేందుకు పోర్టల్‌కు అనుమతిస్తే జనరేట్ సర్టిఫికేట్ ఎంపికపై క్లిక్ చేయండి. ఇది మీ ప్రమాణ పత్రాన్ని రూపొందిస్తుంది.


'హర్ ఘర్ తిరంగ' ప్రచారం ప్రారంభించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి


ప్రచార బోర్డుపై జై హింద్ నినాదం రాసిన దృశ్యం

జెండాను ఎక్కడ పొందాలి

పోస్టల్ విభాగం ప్రజలకు ప్రీమియం ఫ్లాగ్‌లను విక్రయిస్తుంది. హర్ ఘర్ తిరంగ ప్రచార కార్యక్రమం పురస్కరించుకుని ఈ విభాగానికి పతాకం విక్రయం, పంపిణీ బాధ్యతలను కేటాయించారు. రూ.25కి ప్రీమియం పతాకం లభ్యమవుతుంది. దీని కొనుగోలు కోసం www.epost office.gov.in సందర్శించాలి.

రక్త నమూనాలు పంపండి

- వాయనాడ్ దుర్ఘటనలో గల్లంతైన వైద్యుడి గుర్తింపునకు చర్యలు
- తల్లిదండ్రుల రక్త నమూనాల కోసం డీజీపీకి లేఖ

భువనేశ్వర్: కేరళలో ఇటీవల సంభవించిన కొండ చరియల విపత్తులో రాష్ట్రానికి చెందిన వైద్యుడు స్వాధీన్ పండా గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన జాడ లభ్యం కాలేదు. నిరవధికంగా కొనసాగిస్తున్న గాలింపులో లభించిన శరీర అవయవాలతో సరిపోల్చేందుకు గల్లంతైన వైద్యుడి తల్లిదండ్రుల రక్త నమూనాలను కోరుతూ వాయనాడ్ పోలీసులు రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్‌కు లేఖ రాసినట్లు అనుబంధ వర్గాల సమాచారం. మృతదేహాల గుర్తింపు కోసం డీఎన్ఏ, రక్త నమూనాలను పరీక్షిస్తున్నారు. ఈ క్రమంలో జూలై 31 నుంచి సోదరుడిని గుర్తించేందుకు వాయనాడ్‌లో క్యాంప్ చేస్తున్న అతని సోదరి సోమాలి పండా రక్త నమూనా సేకరించి ధ్రువీకరణ కోసం కన్నూరు ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీకి పంపారు. అయితే స్పష్టమైన ధ్రువీకరణ కోసం సోదరి రక్త నమూనాతో పాటు తల్లిదండ్రుల రక్త నమూనాలు కోరినట్లు తెలుస్తోంది. కాగా గల్లంతైన వైద్యుడు స్వాధీన్ పండా కటక్ ఎస్‌సీబీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో సీనియర్ రెసిడెంట్ డాక్టర్. భువనేశ్వర్ రఘునాథ్‌పూర్ నివాసి. స్వాధీన్ పండా, అతని భార్య స్వీకృతి మహాపాత్రో, స్నేహితుడు బిష్ణు ప్రసాద్ చినారా మరియు అతని భార్య ప్రియదర్శిని పాల్‌తో కలిసి జూలై 26న బెంగళూరుకు ఒక సదస్సు కోసం బయల్దేరారు. జూలై 27న బెంగుళూరులో బిష్ణు ప్రసాద్ చినారా జన్మదిన వేడుకని జరుపుకుని వాయనాడ్‌కు వెళ్లారు. అక్కడ చూరల్‌మలలోని లినోరా విల్లాలో బస చేశారు. ఇద్దరు జంటలు విల్లాలో నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున 2 గంటల సమయంలో విధ్వంసకరమైన కొండ చరియలు విరిగిపడిన ఘటన చోటుచేసుకుంది.

భారీగా గంజాయి స్వాధీనం


మల్కన్‌గిరి: పట్టుబడిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నలుగురు యువకులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.4.80 లక్షలు విలువ చేసే 48 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలియజేశారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం నంబర్ ఒకటిలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు యువకులకు సంబంధించిన బ్యాగులను తనిఖీ చేయగా, అందులో గంజాయి పట్టుబడింది. నిందితులు కందమాల్ జిల్లాలోని బలిగుడ ప్రాంతానికి చెందిన ప్రశాంత్ మల్లిక్, ముండా దిగాల్, చంద్రకాంత్ భగర్తీ, బీహార్‌కు చెందిన జన్మాజయ్ గుప్తాగా పోలీసులు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలియజేశారు.

మల్కన్‌గిరి: జిల్లాలోని బలిమెల ఐఐసీ సుమన్ పట్నాయిక్ తన సిబ్బందితో చిత్రకొండ సమితి బలిమెల కూడలి వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో యూపీకి చెందిన ఇద్దరు నిందితులు బస్సు కోసం ఎదురుచూస్తున్నారు. అయితే అనుమానం వచ్చి వారి బ్యాగులు తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. దీంతో వెంటనే వారిని పట్టుకొని అరెస్టు చేశారు. పట్టుబడిన గంజాయి తూకం వేయగా 36 కేజీలు ఉంది. మార్కెట్‌లో ఈ గంజాయి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందని ఐఐసీ సుమన్ పట్నాయిక్ తెలిపారు.


రాయగడ: గంజాయితో పట్టుబడిన నిందితులు

శంఖ భవన్‌కు బీజేడీ శ్రేణులు


రమేష్ మఝితో బీజేడీ శ్రేణులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన బీజేడీ శ్రేణులు రాజధానికి శంఖ భవన్‌కు సోమవారం వెళ్లారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ రమేష్ చంద్ర మఝితో భేటీ అయ్యారు. అనంతరం అక్కడ ఉన్న పార్టీ సీనియర్ నాయకులను కలుసుకున్నారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా తాము నవీన్ వెంట నడుస్తామని పేర్కొన్నారు. పార్టీ పటిష్టతకు తమకు బాధ్యతలు అప్పగించాలని కోరారు. తమ ప్రాంతంలో పార్టీలో ఉన్న కార్యకర్తల మనోబలం పెంచడానికే తామ విచ్చేశామని పేర్కొన్నారు. ఆ ప్రాంత నాయకుడు యజ్ఞేశ్వర్ స్వయ్(బడ బాబు) వీరికి నేతృత్వం వహించారు.

నవీన్‌కు నివేదిక


నవీన్ పట్నాయక్‌కు నివేదిక అందజేస్తున్న నాయకులు

భువనేశ్వర్: పోలవరం నీటి పారుదల ప్రాజెక్టు నిర్మాణంతో రాష్ట్రంపై ప్రభావాన్ని బిజూ జనతా దళ్ పార్టీ క్షేత్రస్థాయి నివేదికని సిద్ధం చేసింది. అతున్ సవ్యసాచి నాయక్ ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు ప్రభావిత ప్రాంతాలు సందర్శించి క్షేత్రస్థాయిలో స్థితిగతులను సమీక్షించింది. ఈ నివేదికని పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్‌కు సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు బిజూ జనతాదళ్ ప్రజలతో ఎప్పుడూ ముందంజ వేస్తుందని నవీన్ పట్నాయక్ తెలిపారు.

నష్ట పరిహారం పెంపు

భువనేశ్వర్: ఏనుగులు ఇళ్లు ధ్వంసం చేస్తే ఇచ్చే రూ.20 వేలు నష్ట పరిహారం పరిధి విస్తరించారు. ఇప్పుడు ఏనుగుల వల్ల ప్రజల ఇల్లు పూర్తిగా దెబ్బతింటే ప్రభుత్వ ఇళ్ల పథకం కింద బాధిత వర్గాలకు కొత్త ఇల్లు కట్టిస్తారు. ప్రపంచ ఏనుగుల దినం సందర్భంగా రాష్ట్ర అటవీ పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి గణేష్ రామ్ సింగ్ ఖుంటియా సోమవారం ఈ ప్రకటన చేశారు. అడవుల్లో ఉన్న గ్రామాలకు సౌర విద్యుచ్ఛక్తి సరఫరా చేసి విద్యుత్ తీగలు తొలగించడంతో ఏనుగులకు విద్యుదాఘాతం నుంచి రక్షణ కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు.


ఐదేళ్లలో నిరాశ్రయులు ఉండరు

భువనేశ్వర్: రానున్న 5 ఏళ్లలో రాష్ట్రంలో నిరాశ్రయులు ఎవరూ ఉండరని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి సోమవారం తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు స్థలం కేటాయిస్తామన్నారు. ప్రధానమంత్రి గృహ నిర్మాణ పథకం కింద ఇళ్లు, విద్యుత్, తాగునీరు, ఉజ్వల గ్యాస్ అందించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఐదేళ్లలో పేదలకు పూర్తి ఇళ్ల ప్యాకేజీ అందుతుందని మంత్రి తెలిపారు.

ఎమ్మెల్యేలకు శిక్షణ శిబిరం

భువనేశ్వర్: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ తొలిసారిగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పలువురు కొత్త ముఖాలు తొలిసారిగా రాష్ట్ర శాసన సభలోకి అడుగిడాయి. ఈ సందర్భంగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈనెల 17, 18 తేదీల్లో రెండు రోజుల పాటు శాసనసభలో ఈ కార్యక్రమం జరుగుతుంది. పార్టీలకు అతీతంగా కొత్త శాసన సభకు ఎన్నికైన ఎమ్మెల్యేలకు శిక్షణ కల్పిస్తారు. కేంద్ర మంత్రులు జె.పి.నడ్డా, ధర్మేంద్ర ప్రధాన్, జుయెల్ ఓరాం వంటి పెద్దలు కొత్త శాసన సభ సభ్యులకు శిక్షణ కల్పిస్తారని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ తెలిపారు.

ఘనంగా ఏనుగుల దినోత్సవం


సెంచూరియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన

పర్లాకిమిడి: అడవులను పెంచాలని, ఏనుగులను సంరక్షించాలని డీఎఫ్‌వో ఎస్.ఆనంద్ అన్నారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో ప్రపంచ ఏనుగుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. వన్యప్రాణుల సంరక్షణపై జిల్లా అటవీ శాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్ ప్రసంగించారు. విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫారెస్టు సంరక్షణ అధికారి అరుణ్ కుమార్ సాహు, సైన్‌శ్రీ దాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి ముఖేష్

- మంత్రి ముఖేష్ మహాలింగ్

భువనేశ్వర్: హెచ్ఐవీ రహిత సమాజ నిర్మాణంతో రాష్ట్రాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దుదామని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. దీనిలో భాగంగా రౌర్కెలా ఆర్‌జీహెచ్ నుంచి చైతన్య ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యేలు శారదా ప్రసాద్ నాయక్, దుర్గా చరణ్ తంతి, ఓఎస్ఏసీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సంతోష్ కుమార్ స్వంయి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో దాదాపు 1,600 గ్రామాల్లో ఎయిడ్స్, హెచ్ఐవీ నివారణ, నిర్మూలన చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవగాహన ప్రచారంలో అధిక సంఖ్యలో ప్రజలు చేరి ఒడిశాను హెచ్ఐవీ రహితంగా మార్చడంలో సాయం చేయాలని పిలుపునిచ్చారు.


చైతన్య ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

సంక్షిప్తంగా..

బాధ్యతల స్వీకరణ

రాయగడ: జిల్లా కలెక్టర్‌గా ఫరుల్ పట్వారి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమెకు జిల్లా అధికారులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

మల్కన్‌గిరి: జిల్లా కలెక్టర్‌గా ఆసిస్ ఈశ్వర్ పాటిల్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించి, ప్రతి సమితి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పర్లాకిమిడి: గజపతి జిల్లా కొత్త కలెక్టర్‌గా బిజయ కుమార్ దాస్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను డీఎఫ్‌వో సుబ్రహ్మణ్యం ఆనంద్, ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ అధికారి డా.గుణనిధి నాయక్, సబ్ కలెక్టర్ అనూప్ పండా తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పట్టాల పంపిణీ

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పుట్ సమితి పరిధి కుడుములగుమ్మ తహసీల్దార్ కార్యాలయంలో అటవీ భూముల హక్కులపై అవగాహన శిబిరం సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా అర్హులైన గిరిజనులకు ఎమ్మెల్యే మంగుఖీలో పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖోయిర్‌పుట్ తహసీల్దార్ టుకును పుట్ట తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కలిమెల సమితి తహసీల్దార్ కార్యాలయంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేశారు.

73(ఎ): లబ్ధిదారులతో ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కామి

ప్రతీ ఇంటిపై త్రివర్ణ పతాకం


జాతీయ జెండాలతో అధికారులు

పర్లాకిమిడి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గజపతి జిల్లాలోని ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని డీఆర్‌డీఏ కార్యనిర్వహణ అధికారి డా.గుణనిధి నాయక్ పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాల్‌లో మిషన్ శక్తి, మహిళా స్వయం సహాయక గ్రూపులకు 90 వేల జాతీయ జెండాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిషన్ శక్తి జిల్లా కో–ఆర్డినేటర్ టిమోన్ బోరా, మనస్మితా పాత్రో, జిల్లా కల్చరల్ అధికారి అర్చనా మంగరాజ్, డీపీఆర్‌వో ప్రదీప్త గురుమయి తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు ఇళ్లు

భువనేశ్వర్: రాష్ట్రంలో నిరాశ్రయులకు ఇళ్లు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్థలం, ఇళ్లు లేని కుటుంబాలు, దివ్యాంగ సభ్యుల వర్గం నుంచి నిరాశ్రయుల గుర్తింపు ప్రక్రియకు ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రభుత్వ పథకాల కింద భూమి, ఇళ్లు కేటాయించడానికి ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలని ప్రభుత్వం జిల్లా అధికార యంత్రాంగాన్ని కోరింది.

బీజేపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్


స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఆజాదీ కా అమృత్ మహోత్సవాలు పురస్కరించుకొని కాశీనగర్ పట్టణం బస్టాండ్ నుంచి శ్రీరాం కళాశాల వరకు బీజేపీ శ్రేణులు స్వచ్ఛ భారత్ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత ఆర్.నారాయణరావు, కన్యాకుమారి సాహు, కె.దాసు, ఎల్.చంద్రరావు, బీజేపీ యువజన మోర్చా నాయకులు మేడిబోయిన ప్రకాష్ కుమార్, పి.మురళీ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కలెక్టర్‌కు సన్మానం


కలెక్టర్ కమలోచన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ కమలోచన్ మిశ్ర బదిలీపై వెళ్లనున్నారు. దీంతో ఆయనను స్థానిక జగన్నాథ మందిర కమిటీ సభ్యులు సోమవారం సన్మానించారు. ఆలయం అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ సభ్యుడు సుభాస్ సురో, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహానికి మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని సాహిద్ లక్ష్మణ్ నాయక్ పాఠశాలలో ఉన్న లక్ష్మణ్ నాయక్ విగ్రహానికి ఐకాన్ ఇన్ మోషన్ యువజన సంస్థ సభ్యులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం స్వాతంత్య్ర పోరాటయోధులకు నివాళులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యువకులు ఈ విగ్రహానికి పూర్వ వైభవం తీసుకొచ్చారు.

అన్నప్రసాద సేవనం


సామూహిక ప్రసాద సేవనంలో బాబాలు

కొరాపుట్: అలేఖ్ బాబా మతం సమాజానికి శాంతి హితమని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి పేర్కొన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్నటువంటి గోవింద మఠంలో సోమవారం జరిగిన అలేఖ్ మత నవాన్న సేవన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం సుమారు 3,000 మంది బాబాలు సామూహిక ప్రసాద సేవనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు సర్వేశ్వర పాత్రో, కాంగ్రెస్ నాయకుడు మున్నా త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్ చైతన్య ర్యాలీ


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ ఉన్నటువంటి గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) యూనివర్సిటీ ఆధ్వర్యంలో యాంటీ ర్యాగింగ్ చైతన్య ర్యాలీ సోమవారం జరిగింది. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండి ఉత్తమ విద్యార్థులుగా భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కులపతి డాక్టర్ ఏపీఎస్ఎల్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పోటెత్తిన అర్జీదారులు

- మంత్రి అనుయాయులే వినతుల స్వీకరణ
- కంగుతిన్న అర్జీదారులు
- రెవెన్యూ సమస్యలే అధికం


అర్జీదారుల వినతులను ముందుగా పరిశీలిస్తున్న మంత్రి అనుయాయులు, బంధువులు


మంత్రి శ్రీనివాస్ వెనుకే ఉన్న టీడీపీ నాయకులు

విజయనగరం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికను రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తొలిసారిగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. మంత్రి స్వయంగా వినతులు స్వీకరిస్తారని ప్రచారం చేయడంతో అర్జీదారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు వినతులు స్వీకరించిన కార్యక్రమంలా కాకుండా మంత్రి అనుయాయులు, బంధువుల సమక్షంలో జరగడం విశేషం. అర్జీదారులు తీసుకువచ్చిన వినతులను కలెక్టర్, మంత్రికి ఇవ్వడానికి ముందే సంబంధిత మంత్రి అనుయాయులు, బంధువులు తీసుకుని సిఫార్సులు చేయడం కనిపించింది. ముందుగా అర్జీలను వాళ్లు పరిశీలించి కలెక్టర్, మంత్రికి ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నెలకొన్న సమస్యలైతే అర్జీదారులను వీరు వేదిక వరకు కూడా వెళ్లనీయడం లేదు. దీంతో పలువురు అర్జీదారులు నిరాశ చెందారు.

రెవెన్యూ శాఖకు సంబంధించినవే..

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ వ్యక్తిత, సామాజిక సమస్యలపై 287 వినతులు అందాయి. వీటిలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 182 వరకు అర్జీలు అందాయి. తర్వాత స్థానంలో పింఛన్ మంజూరు చేయాలని 31 మంది అర్జీలు అందజేశారు. పంచాయతీరాజ్ శాఖకు 20, మున్సిపల్ శాఖకు 20, విద్యాశాఖ, ట్రాన్స్‌కోకు సంబంధించి 9 వంతున, గ్రామ, వార్డు సచివాలయాల శాఖకు సంబంధించి ఆరు, ఆస్పత్రుల సమన్వయ అధికారికి 5, వైద్యారోగ్యశాఖకు 3, హౌసింగ్ శాఖకు 2 వంతున వినతులు అందాయి. వినతల స్వీకరణలో మంత్రితో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత తదితరులు పాల్గొన్నారు. రెవెన్యూ సమస్యలపై వచ్చిన వినతుల పరిష్కారానికి సంబంధిత మండల తాహసీల్దార్లతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

దివ్యాంగుని సమస్యకు తక్షణ పరిష్కారం

పరిష్కార వేదికకు వచ్చిన ఓ దివ్యాంగుడి సమస్యకు మంత్రి తక్షణ పరిష్కారం అందించారు. వినతిపత్రం అందించగానే వెంటనే ఆయనకు వినికిడి పరికరాన్ని అందించాలని విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎ.డి జగదీష్, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆదేశించారు. దీంతో వెంటనే అధికారులు వినికిడి పరికరాన్ని తీసుకురాగా, మంత్రి బాధితుడికి అందజేశారు.

అధికారుల సహకారం ముఖ్యం: మంత్రి కొండపల్లి

ఈ సందర్భంగా జిల్లా అధికారులను ఉద్దేశించి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ.. విజయనగరాన్ని వికసిత్ జిల్లాగా రూపొందించడంలో అధికారుల సహకారం ముఖ్యమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. జిల్లా అధికారులంతా సమర్థవంతంగా విధులు నిర్వహించి, ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనులు చేయాలని కోరారు. ప్రభుత్వ అధికారులందరి పనితీరుపైనా పర్యవేక్షణ ఉంటుందని చెప్పారు.

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి..


కలెక్టర్ కార్యాలయంలో వినతులు పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

- గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం: భూ సమస్యలపై ఫిర్యాదులు అధికంగా వస్తున్న తరుణంలో ఆగస్టు 15 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఏపీ మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్. శోభిక, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ జి. కేశవనాయుడు, ఐటీడీఏ పీఓ సేథు మాథవన్, తదితర అధికారులతో కలిసి వ్యక్తిగత, సామాజిక సమస్యలకు సంబంధించి 220 అర్జీలను స్వీకరించారు. సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

భూ సమస్యలపైనే అధిక ఫిర్యాదులు..

భూ సమస్యలు, కుటుంబ సమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయని మంత్రి సంధ్యారాణి అన్నారు. కుటుంబ సమస్యలను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు స్కిల్ డవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామన్నారు. గిరిజన యువతకు ట్రైకార్ రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. గిరిశిఖర గ్రామాల గర్భిణులకు డోలీ ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక వసతిగృహాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

పీఓ బదిలీ నిలిపివేయాలి

సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బదిలీని నిలిపివేయాలని ఆదివాసీ నాయకులు బిడ్డిక రామ్మోహన్, ఎస్. మోహన్‌పాల్, ఎం. విశ్వనాథం, ఎస్. చిరంజీవి, రామస్వామి, తదితరులు కోరుతూ మంత్రి సంధ్యారాణికి వినతి పత్రం అందజేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

క్లుప్తంగా

అన్న క్యాంటీన్ స్థలంపై వివాదం


హెచ్‌డీటీ భానుప్రసాద్‌కు ఫిర్యాదుచేస్తున్న జమిందార్ కుటుంబ సభ్యుడు పీబీ శ్రీనివాస్

సాలూరు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు స్థలం గుర్తించి, ఈ నెల 14న భూమిపూజ చేపట్టేందుకు అధికార పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. అయితే ఈ స్థలంపై హైకోర్టులో స్టేటస్‌కో ఉందని సాలూరు జమిందార్ కుటుంబానికి చెందిన పీబీ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో హెచ్‌డీటీ భానుప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదులో తెలిపిన వివరాల ప్రకారం.. సర్వే నంబర్ 162/2లో ఉన్న ఈ స్థలంలో అప్పటి విలేకరుల సంఘ నాయకులు 2009లో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి సిద్ధమయ్యారు. అయితే ఆ స్థలం తమదేనని జమిందార్ కుటుంబానికి చెందిన విక్రమ చంద్రసన్యాసిరాజు కోర్టులో కేసు వేశారు. దీనిపై విలేకరుల సంఘ నాయకుడు ఆర్‌పీ నారాయణమూర్తి కౌంటర్ దాఖలు చేయగా.. హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ స్టేటస్‌కో ఇప్పటికీ కొనసాగుతోందని పీబీ శ్రీనివాస్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదాస్పద స్థలంలో అన్న క్యాంటీన్ నిర్మించవద్దని ఆయన కోరారు. కాగా ఈ స్థలం సీతారామస్వామి వారి ఆలయం ట్రస్ట్‌కు చెందినదిగా ఇటీవల దేవదాయశాఖ అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే దీనిపై దేవదాయశాఖ అధికారుల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ట్రస్ట్ సభ్యుల్లో ఒకరైన జమిందార్ కుటుంబీకుడు పీబీ శ్రీనివాస్ ఫిర్యాదుతో ఈ స్థల వివాదం వెలుగులోకి వచ్చింది. దీనిపై మున్సిపల్ ఏఈ సూరప్పలనాయుడును వివరణ కోరగా.. రెవెన్యూ అధికారులు తమకు స్థలాన్ని చూపించడంతో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నామని, స్థల వివాదం గురించి తమకు తెలియదన్నారు. కోర్టులో స్టేటస్ కో ఉన్నందున కూటమి నాయకులు వేరే ప్రాంతంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి తమ సచ్ఛీలతను నిరూపించుకుంటారా, లేక అక్కడే ఏర్పాటు చేస్తారా అన్నది వేచి చూడాలి.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


జంబో రామారావు (ఫైల్)


భామిని: భార్య పుట్టింటికి వెళ్లిందని తీవ్ర మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కీసరలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన జంబో రామారావు (46) భార్య లక్ష్మితో నివాసముంటున్నాడు. మూడు రోజుల కిందట లక్ష్మి కొత్తూరు మండలం కడుము గ్రామంలోని కన్నవారింటికి వెళ్లింది. సోమవారం తిరిగి రావాల్సి ఉన్నా, ఆమె రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన రామారావు మద్యం మత్తులో పురుగు మందు తాగాడు. వెంటనే స్థానికులు స్పందించి రామారావును పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


గాయపడిన గణపతి

పూసపాటిరేగ: స్థానిక జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం నరిసింగపల్లికి చెందిన గొలజాన గణపతి రహదారి దాటుతుండగా.. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి విజయనగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఎ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాయి గెడ్డ గ్రామంలోకి ఏనుగులు


గ్రామ పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలంలోని జరప పంచాయతీ పట్టాయిగెడ్డ గిరిజన గ్రామంలోకి ఏనుగుల గుంపు సోమవారం చొరబడింది. ఇప్పటివరకూ పోడు పంటలను నాశనం చేసిన ఏనుగులు ఏకంగా గ్రామంలోకే చొరబడడంతో గ్రామంలోని గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతూ పరుగులు తీశారు. ఈ బాధలు ఇంకెన్నాళ్లు అనుభవించాలని, అధికారులు స్పందించి ఏనుగుల గుంపును తరలించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సమస్యలను పరిష్కరించండి..

- ఎస్పీ వకుల్ జిందల్


అర్జీదారుడి సమస్య వింటున్న ఎస్పీ వకుల్ జిందల్


పార్వతీపురం టౌన్ : వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

విజయనగరం క్రైమ్: అర్జీదారులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. సోమవారం స్థానిక పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ 42 అర్జీలు స్వీకరించారు.అనంతర ఆయన పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదించాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, డీఎస్పీ ఆర్.గోవిందరావు, డీసీఆర్‌బీ సీఐ జె.మురళి, ఎస్‌బీ సీఐలు కేకేవీ విజయనాథ్, ఈ. నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై గణేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది వినతులు..

పార్వతీపురం టౌన్: ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది వినతులు అందాయని ఎస్పీ మాధవ్‌రెడ్డి అన్నారు. కార్యాలయానికి వచ్చిన అర్జీదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సమస్యలను పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడుతూ, సమస్యలను చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ బీఎండీ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య..?

- బంగారు ఆభరణాల కోసమేనా..!


కృష్ణవేణమ్మ (ఫైల్)


కృష్ణవేణమ్మ మృతదేహం

బాడంగి: మండల కేంద్రంలోని ముగడ కాలనీలో నివాసముంటున్న వృద్ధురాలు గెద్ద కృష్ణవేణమ్మ (62) ఆదివారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందింది. అయితే ఆమె ఒంటిపై బంగారు ఆభరణాలు మాయం కావడం, ఇళ్లంతా చిందరవందరగా ఉండడంతో కుటుంబ సభ్యులు, పోలీసులు హత్యగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.... కృష్ణవేణమ్మ ముగడ కాలనీలో ఒంటరిగా నివాసముంటోంది. ఈమె భర్త అప్పలనారాయణ (రిటైర్డ్ టీచర్) గతంలోనే మృతి చెందగా... ఇద్దరు కుమారులు వేరే ప్రాంతాల్లో నివాసముంటున్నారు. దీంతో ఆమె ఒంటరిగా ఉంటోంది. సోమవారం ఉదయం ఇంటి నుంచి గ్యాస్ వాసన రావడంతో పక్కనే ఉన్న మహిళలు కిటికీలోంచి చూడగా.. కృష్ణవేణమ్మ నేలపై పడిపోయి ఉంది. వెంటనే ఈ విషయాన్ని పాలకొండలో ఉంటున్న ఆమె రెండో కుమారుడు నాగేంద్రకుమార్‌కు తెలియజేయగా.. తాళాలు పగులగొట్టి తల్లిని ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించాడు. స్థానికులు తాళాలు పగులగొట్టి చూడగా.. ఆమె మృతి చెంది ఉంది. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఎస్సై జయంతి, బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు, రామభద్రాపురం, తెర్లాం ఎస్సైలు జ్ఞానప్రసాద్, రమేష్, విజయనగరం నుంచి నేరపరిశోధన టీమ్ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

హత్యగా అనుమానం..

ఇంటి పరిసరాలను గమనిస్తే ఇళ్లంతా చిందరవందరగా ఉండడం, మృతురాలి ఒంటిపై బంగారు నగలు లేకపోవడంతో ఎవరో ఆదివారం రాత్రి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బంగారం తీసే క్రమంలో ఆమె ప్రతిఘటించడంతో పీక పిసికి చంపి ఉంటారని భావిస్తున్నారు. మృతురాలి మెడభాగం కమిలిపోగా.. ముక్కు నుంచి రక్తం కారిన ఆనవాలున్నాయి. ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు పోయినట్లు గుర్తించారు.

కేసు నమోదు..

మృతురాలి పెద్ద కుమారుడు హరికృష్ణ విశాఖలో, చిన్న కుమారుడు నాగేంద్రకుమార్ పాలకొండలో ఉంటున్నారు. చిన్నకుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక సీహెచ్‌సీలో పోస్టుమార్టం నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

సంతకవిటి: వృద్ధురాలి హత్య కేసుకు సంబంధించిన నిందితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని కేఆర్ పురం గ్రామానికి చెందిన కాయల ఎల్లమ్మ (60)పై అదే గ్రామానికి చెందిన తేగల రాము మద్యం మత్తులో ఈ నెల మూడో తేదీన దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఎల్లమ్మను శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. అప్పటి నుంచి నిందితుడు పరారీలో ఉండగా... సోమవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్ర, ఎస్సై షేక్ శంకర్ తెలిపారు.

ప్రశ్నించేతత్వమే పరిశోధనలకు పునాది..

- సెంచూరియన్ వీసీ పీకే మహంతి


విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ పీకే మహంతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: ప్రాజెక్టుల తయారీపై విద్యార్థులు పట్టు సాధించాలని సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రశాంతకుమార్ మహంతి అన్నారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్‌లో ఈసీఈ విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశ్నించేతత్వమే పరిశోధనలకు పునాది అని, ఎందుకు, ఏమిటి, ఎలా అనే ప్రశ్నల నుంచే నూతన ఆవిష్కరణలు పుట్టుకొస్తాయన్నారు. విద్యార్థులు తయారుచేసిన ప్రాజెక్టులు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఈసీఈ విభాగాధిపతి జోగినాయుడు, డీన్లు మాధవరావు, సన్నీడియోల్, తదితరులు పాల్గొన్నారు.

అందమైన చేతిరాత.. భవిష్యత్‌కు బంగారు బాట

- నేడు ప్రపంచ కాలిగ్రఫీ (చేతిరాత) దినోత్సవం
- కాలిగ్రఫీలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న నందిని
- తోటి విద్యార్థులకు నేర్పుతూ ఆదర్శంగా నిలుస్తున్న చిన్నారి


నాటి విజయవాడ కలెక్టర్ ఢిల్లీరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని కొల్లి నందిని (ఫైల్)


విద్యార్థులకు అందమైన చేతిరాత గురించి శిక్షణ ఇస్తున్న కొల్లి నందిని

సాలూరు: అందమైన చేతిరాత జీవితాన్ని సుందరంగా మారుస్తుందో లేదో చెప్పలేం కాని విద్యార్థులకు పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి దోహదపడుతుందని కచ్చితంగా చెప్పవచ్చు. ఆగస్టు రెండో బుధవారం (నేడు) ప్రపంచ కాలిగ్రఫీ దినోత్సవం సందర్భంగా కాలిగ్రఫీలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న సాలూరుకు చెందిన కొల్లి నందినిపై ప్రత్యేక కథనం. పట్టణంలోని గాడివీధి మున్సిపల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న కొల్లి నందిని రెండేళ్ల కిందట అందమైన చేతి రాత కోసం (7వ తరగతిలో) కృషి చేసింది. ఆన్‌లైన్‌లో శిక్షణ పొందిన అనంతరం రాష్ట్ర స్థాయిలో ఇంగ్లిష్‌లో జరిగిన కాలిగ్రఫీ పరీక్షల్లో ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రథమస్థానం సంపాదించింది. విజయవాడలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో నాటి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మన్ననలతో పాటు ప్రశంసా పత్రాన్ని పొందింది. తన చేతిరాతకు మరింత పదును పెట్టి రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ, పలు అవార్డులు సొంతం చేసుకుంది.

తోటి విద్యార్థులకు నేర్పుతూ..

అందమైన చేతిరాత తన తోటి విద్యార్థులకు కూడా సొంతం కావాలనే ఉద్దేశంతో తన ప్యాకెట్ మనీ నుంచి పుస్తకాలు కొనుగోలు చేసి గతేడాది వేసవిలో పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో నిరుపేద పిల్లలకు అందించింది. వారికి చేతిరాతకు సంబంధించి శిక్షణ తరగతులు నిర్వహించింది. అలాగే తాను ప్రస్తుతం చదువుతున్న ప్రభుత్వ పాఠశాలలో 7, 8 తరగతుల విద్యార్థులకు సైతం శిక్షణ ఇస్తోంది. ఖాళీ సమయాల్లో నందిని తరగతులు నిర్వహిస్తూ తోటి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేయడంతో చిన్నారిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ

కాశీబుగ్గ: మందస మండలంలోని చీపి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. 160 మంది ఉండాల్సిన ఆశ్రమ పాఠశాలలో 82 మంది విద్యా ర్థులు మాత్రమే ఉండడానికి కారణాలు ఏంటని అడిగారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అనంతరం చీపి గ్రామంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు.

యూనిఫారం పేరుతో డబ్బులు వసూలు

- ఉపాధ్యాయుడి తీరుపై తల్లిదండ్రుల ఫిర్యాదు


ఉపాధ్యాయుడి తీరుపై ఫిర్యాదు చేస్తున్న విద్యార్థుల తల్లులు



బ్రాంచ్ పాఠశాల

పార్వతీపురం టౌన్: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే యూనిఫారం పేరు తో అక్రమ వసూళ్లకు పాల్పడిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జి.నరసింహదేవ్ 12 ఏళ్లుగా ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అలాగే ఎన్‌సీసీ టీచర్‌గా కూడా అతనే వ్యవహరిస్తున్నారు. 100 మంది ఎన్‌సీసీ వలంటీర్ల బ్యాంక్ ఖాతాలకు యూనిఫారం పేరిటి వచ్చిన డబ్బును తిరిగి ఆయన తీసుకున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3500 నుంచి నాలుగు వేల రూపాయల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంపై పలువురు తల్లితండ్రులు మాట్లాడుతూ, మీ పిల్లల బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడ్డాయి. నాకు తెచ్చి ఇవ్వండి అని ఆ టీచర్ అడగడంతో తాము ఇచ్చామని చెప్పారు. స్కూల్ నుంచి రిలీవ్ అయిన పదో తరగతి విద్యార్థుల నుంచి యూనిఫారం కూడా తిరిగి తీసుకున్నారని తెలిపారు. వాస్తవానికి ఎన్‌సీసీలో జాయిన్ అయిన తర్వాత 13వ బెటాలియన్ వారు 2021 సంవత్సరం వరకు క్లాత్, రూ.600 కుట్టుకూలి ఇచ్చేవారు. 2022లో రూ.3800 చొప్పున విద్యార్థుల బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. 2023 సంవత్సరానికి సంబంధించి 2024 మార్చి నెలలో రూ.4370 వేశారు. ఇందులో ఒక్కో విద్యార్థి నుంచి రూ. 3500 నుంచి నాలుగు వేల రూపాయలు నరసింహదేవ్ వసూలు చేశారని తల్లిదండ్రులు చెబుతున్నారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌సీసీలో జాయిన్ అవ్వగానే ఎవరికి వారు యూనిఫారం కుట్టించుకున్నారు. వారికి 9వ తరగతిలో డబ్బులు వేశారు. అలాగే 9వ తరగతిలో జాయిన్ అయిన వారికి 10వ తరగతిలో వేశారు. స్కూల్ నుంచి 10వ తరగతి విద్యార్థులు రిలీవ్ కాగానే యూనిఫారం తీసుకుని, అవే దుస్తులను కొత్తగా జాయిన్ అయిన విద్యార్థులకు ఇస్తున్నారు. కొంతమంది విద్యార్థులు ఆ దుస్తులను మరలా సరి చేసుకుని వేసుకున్న పరిస్థితులు కూడా ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన దుస్తులు, డబ్బులు తీసుకోవడం ఎంతవరకు న్యాయమని, వెంటనే విద్యాశాఖ, ఎన్‌సీసీ అధికారులు విచారణ చేపట్టి న్యాయం చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. అలాగే ఎన్‌సీసీ వలంటీర్లకు ఇవ్వాల్సిన టిఫిన్ విషయంలో కూడా ఉపాధ్యాయుడు చేతివాటం ప్రదర్శిస్తున్నాడన్న విమర్శలున్నాయి.

విచారించా..

నేను హెచ్‌ఎంగా వచ్చి ఏడాది అయింది. డబ్బుల వసూలు విషయమై కొంతమంది విద్యార్థులు, తల్లిదండ్రులు నాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్‌సీసీ టీచర్ నరసింహదేవ్‌ను పిలిచి వివరణ కోరగా.. విద్యార్థులకు యూనిఫారం, టై, షూ ఇస్తున్నానని, అందుకే డబ్బులు వసూలు చేసినట్లు చెప్పారు.

– వి. వరప్రసాదరావు, హెచ్‌ఎం బ్రాంచ్ స్కూల్

20న జాబ్ మేళా


జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్

పార్వతీపురం టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా 18 నించి 35 ఏళ్ల మధ్య ఉన్న నిరుద్యోగ మహిళలకు నార్మల్ డిగ్రీ/పీజీ-డిగ్రీ (కెమిస్ట్రీ, ఆక్వా కల్చర్, మైక్రో బయాలజీ) చదువుకుని వయస్సు 19 నిండి 25 సంవత్సరాలు మధ్య ఉన్నటువంటి నిరుద్యోగ యువకులకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవంతి ఫ్రోజెన్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఇంటర్వ్యూస్ నిర్వహించనుందని, ఈ డ్రైవ్‌కు కంపెనీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోనున్నారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు వారి వివరాలను హెచ్‌టీటీపీఎస్//స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిఫరెన్స్ నంబర్‌తో పాటు రెస్యూమె, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, ఒరిజినల్, జిరాక్స్ సెట్లు, 1 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరిగే ప్రదేశంలో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6305110947, 9494777553 నంబర్లలో సంప్రదించాలని వివరించారు.